TG/TEL/25/A3731

# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-167 | పేజీలు:-4 | శనివారం 30- 05 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం



- ★వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై మంత్రి మీడియా సమావేశం
- ★ప్రతిపక్షాలు కావాలనే విమర్శలు చేస్తున్నాయని మండిపాటు
- ★75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- ★ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వెల్లడి

ధాన్యం కొనుగోళ్ల అంశంపై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల - మిగతా 2 లో

## తెలంగాణ ఇందిరమ్మ బీమాపై
# ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఆ వయసు దాటితే రూ.5 లక్షల సాయం కష్టమేనా?
- తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం
- గురించి ఒక ముఖ్యమైన సమాచారం వెలువడింది.
- ఈ బీమా పథకం ముఖ్య ఉద్దేశం లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడం

2లో



దీనిలో భాగంగా లబ్ధిదారుల గరిష్ట వయో పరిమితిని 57 సంవత్సరాలుగా నిర్ణయించాలని ప్రభుత్వం ఆలోచనలో ఉంది. అయితే, గతంలో 60 ఏళ్ల వయోపరిమితిపై పరిశీలనలు

## పవన్ ఒక ప్యాకేజ్ స్టార్

జగన్ ఎక్కువ ఇస్తే అటు వెళతారు: కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



- పవన్ కళ్యాణ్‌పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్
- పవన్‌ను ప్యాకేజ్ స్టార్‌గా అభివర్ణించిన ఎమ్మెల్యే
- ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదని వ్యాఖ్య
- తెలంగాణ జోలికొస్తే 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం తప్పదని హెచ్చరిక
- హైదరాబాద్‌లో ఆస్తులు పెట్టుకుని అమరావతి కట్టడంపై ప్రశ్న

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ - మిగతా 2 లో

## ప్రపంచం మమ్మల్ని వ్యతిరేకిస్తున్నా, భారత్ అండగా ఉంది

ఇండియన్స్‌కు మాపై పిచ్చి అభిమానం: నెతన్యాహు



- ❖అమెరికాలో తగ్గుతున్న ఆదరణ.. భారత్‌ను కీర్తించిన ఇజ్రాయెల్ ప్రధాని
- ❖ప్రపంచంలో ఏ దేశం నుంచీ లేనంతగా, భారత్ నుంచే తనకు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని వ్యాఖ్య
- ❖గతంలో తన భారత పర్యటనను 'లవ్ ఫెస్ట్'గా అభివర్ణించిన నెతన్యాహు
- ❖యూఎస్‌లో తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పాక్ సోషల్ మీడియా బాట్ ఫామ్స్‌ను వాడుతోందని ఆరోపణ

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి భారత్‌పై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా

## ఆ మూడు డిమాండ్లు ఒప్పుకుంటేనే డీల్

ఇరాన్‌కు ట్రంప్ రెడ్ లైన్స్

- ★ఇరాన్‌తో అణు ఒప్పందంపై మూడు కఠిన షరతులు విధించిన ట్రంప్
- ★శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై ప్రధానంగా దృష్టి
- ★తాత్కాలిక కాల్పుల విరమణ పొడిగింపుపై కొనసాగుతున్న చర్చలు
- ★ఒప్పందంపై తొందరపడొద్దని అధికారులకు ట్రంప్ స్పష్టమైన ఆదేశాలు



ఇరాన్‌తో అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అత్యధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వల విషయంలో మూడు కఠినమైన షరతులను (రెడ్ లైన్స్) విధించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణను

## కొడుకుకు కీలక మంత్రిత్వ శాఖలు

డిమాండ్ల జాబితాను రాహుల్ గాంధీకి ఇచ్చిన సిద్ధరామయ్య



- ➢రాజీనామా అనంతరం గురువారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సిద్ధరామయ్య
- ➢కుమారుడు యతీంద్రతో కలిసి ఖర్గే, రాహుల్ గాంధీలను కలిసిన సిద్ధూ
- ➢రాష్ట్రానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు అధిష్ఠానానికి థ్యాంక్స్ చెప్పిన సిద్ధరామయ్య

కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన మరుసటిరోజే, సిద్ధరామయ్య శుక్రవారం- మిగతా 2 లో

# డీకే శివకుమార్ వర్సెస్ విజయ్
# ఇద్దరూ కోటీశ్వరులే కానీ తేడా ఇదే!

- భారత రాజకీయాల్లో ముగిసిపోతున్న సాదాసీదా నేతల శకం
- ఆస్తులను ప్రదర్శించేందుకు వెనుకాడని డీకే శివకుమార్
- నిశ్శబ్దంగా భారీ సంపదను కూడబెట్టిన నటుడు-రాజకీయవేత్త విజయ్
- ఒకరు ఆడంబరంగా.. మరొకరు సంప్రదాయబద్ధంగా సంపద పోగుచేయడంపై ఆసక్తి
- మారుతున్న రాజకీయాల్లో సంపద కూడా బ్రాండ్‌గా మారుతోందన్న విశ్లేషణలు



2లో

భారత రాజకీయాల్లో సాదాసీదా ముఖ్యమంత్రుల శకం ముగిసిపోతున్నట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు తెల్లటి కుర్తా, రబ్బరు చెప్పులతో నిరాడంబరంగా కనిపించేందుకే నేతలు ఇష్టపడేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది.

## కూలిన నిర్మాణంలో ఉన్న వంతెన

ఆరుగురు కార్మికుల మృతి!



యూపీలోని హమీర్‌పూర్ జిల్లాలో ఘటన బెత్వా నదిపై నిర్మిస్తున్న వంతెన గాలివాన ధాటికి కూలిన బ్రిడ్జి మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానం ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి దాటిన - మిగతా 2 లో

## హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న 2,000 నౌకలు

- ఉద్రిక్తతలు తగ్గడంతో బయటకు వచ్చేందుకు నిరీక్షణ
- నౌకల రాకపోకలు మొదలైతే తగ్గనున్న చమురు ధరలు



వెల్లడించిన అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ జలసంధిపై టోల్ విధించబోమని ఒమన్ హామీ అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా - మిగతా 2 లో

## పెట్టుబడుల కోసం పోటీకి రెడీ

తమిళనాడు మంత్రికి లోకేశ్ ఫ్రెండ్లీ ఛాలెంజ్!



- ❖పెట్టుబడుల కోసం తమిళనాడు మంత్రి కీర్తన చేసిన ప్రచార వీడియో
- ❖వీడియోపై స్పందించి పోటీకి సిద్ధమని ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- ❖ఏపీ, తమిళనాడు మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటుందని స్పష్టీకరణ
- ❖పెట్టుబడులే ఉద్యోగాలు సృష్టిస్తాయని, ట్రోల్స్‌ను పట్టించుకోవద్దని హితవు
- ❖లోకేశ్ ట్వీట్‌కు ధన్యవాదాలు తెలుపుతూ కీర్తన ప్రత్యుత్తరం

పొరుగు రాష్ట్రమైన తమిళనాడుతో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ కచ్చితంగా పోటీ పడుతుందని, ఈ పోటీ ఆరోగ్యకరంగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, - మిగతా 2 లో

## కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు

రాహుల్ గాంధీతో షర్మిల భేటీ



- ➢భేటీలో షర్మిల భర్త అనిల్ కుమార్, కేసీ వేణుగోపాల్
- ➢కర్ణాటక నుంచి రాజ్యసభ సీటు కోరుతున్నట్లు కథనాలు
- ➢వైఎస్ఆర్టీపీని విలీనం చేసిన సమయంలో రాజ్యసభ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ - మిగతా 2 లో

# మహానాడులో
# టీడీపీకి విరాళాల వెల్లువ

రెండు రోజుల్లో మొత్తం ఎంత వచ్చాయంటే..!

రెండు రోజుల్లో రూ.25.61 కోట్లు వచ్చినట్లు ప్రకటించిన చంద్రబాబు

అత్యధికంగా రూ.5 కోట్లు విరాళమిచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి కోట్లలో విరాళాలు

విరాళాల సేకరణ ఎన్టీఆర్ హయాం నుంచే ఉందని తెలిపిన సీఎం

2లో



టీడీపీ మహానాడుకు విరాళాలు వెల్లువెత్తాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలో పార్టీకి నేతలు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు భారీగా ఆర్థిక చేయూతను అందించారు. మొత్తం రూ.25.61 కోట్ల

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
శనివారం 30- 05 - 2026

# కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి – ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఏపీ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీతో భేటీలో షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

# పవన్ ఒక ప్యాకేజ్ స్టార్

మొదటిపేజీ తరువాయి – రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. "మీరంతా ఉండేది హైదరాబాద్‌లో, ఆస్తులు సంపాదించుకునేది ఇక్కడే. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని, తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

# కొడుకుకు కీలక మంత్రిత్వ శాఖలు

మొదటిపేజీ తరువాయి – ఉదయం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. డీకే శివకుమార్ నేతృత్వంలో ఏర్పడబోయే మంత్రివర్గంలో తన కుమారుడికి కీలక మంత్రిత్వ శాఖలు కేటాయించాలని కోరడంతో పాటు తన డిమాండ్ల జాబితాను పార్టీ అధిష్ఠానానికి సమర్పించారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య గురువారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈరోజు ఉదయం తన కుమారుడు యతీంద్రతో కలిసి ఖర్గే, రాహుల్ గాంధీలను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. తాను కర్ణాటక రాజకీయాల్లోనే ఉంటానని పార్టీ పెద్దలకు చెప్పారు. అనంతరం ఆయన తన డిమాండ్ల జాబితాను వారికి ఇచ్చారు. సిద్ధరామయ్య రాజ్యసభ, ఎమ్మెల్సీ నియామకాల కోసం కొన్ని పేర్లను అధిష్ఠానానికి సమర్పించినట్లు తెలుస్తోంది. అలాగే మంత్రివర్గంలో కేటాయించే పదవులపై కూడా తన ప్రాధాన్యతలను ఆయన జాబితాలో పొందుపరిచారు. వైద్య, విద్య, వెనుకబడిన తరగతుల శాఖలు లేదా ఇటీవలి వరకు శివకుమార్ నిర్వహించిన పరిశ్రమలు లేదా జలవనరుల శాఖ వంటి కీలక పోర్ట్‌ఫోలియోలను తన కుమారుడికి కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది.

# కూలిన నిర్మాణంలో ఉన్న వంతెన

మొదటిపేజీ తరువాయి – తర్వాత ఘోర ప్రమాదం జరిగింది. బెట్వా నదిపై కురారాలోని మోరాకందర్ పర్సాని నుంచి నైతి గ్రామం వరకు నిర్మిస్తున్న వంతెన శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోయింది. తీవ్రమైన గాలివాన రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో అక్కడ పనులు జరుగుతుండటంతో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు ఐదుగురి మృతదేహాలను వెలికితీసి గుర్తించారు. శిథిలాల కింద మరో ముగ్గురు కార్మికులు చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. వారిని కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

## హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న 2,000 నౌకలు

మొదటిపేజీ తరువాయి – పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయిన దాదాపు 2,000 వాణిజ్య నౌకలు హర్మూజ్ జలసంధి నుంచి బయటకు వచ్చేందుకు ఎదురుచూస్తున్నాయని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. గురువారం (28న) ఆయన మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నాయని, నౌకల రాకపోకలకు మార్గం సుగమం అయితే ప్రపంచ చమురు సరఫరాలు వేగంగా పుంజుకుని, ధరలు తగ్గే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో ఐదో వంతు హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది. ఇది అత్యంత కీలకమైన వాణిజ్య మార్గం. ఈ ఏడాది ప్రథమార్ధంలో అమెరికా–ఇరాన్ మధ్య వివాదం ముదరడంతో ఈ మార్గంలో నౌకల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. భద్రతా కారణాలు, బీమా సమస్యలు, ఇరాన్ ఆంక్షల వల్ల గతంలో రోజుకు 100కి పైగా నౌకలు ప్రయాణించే ఈ మార్గంలో రద్దీ పూర్తిగా పడిపోయింది. దీంతో వేలాది మంది నావికులు నౌకల్లోనే చిక్కుకుపోగా, ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. నిలిచిపోయిన వాటిలో అత్యధికంగా చమురు ట్యాంకర్లే ఉన్నాయి. ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ మే నెలలో చమురు ధరలు ఇప్పటికే 10 శాతం తగ్గాయని బెస్సెంట్ తెలిపారు. జలసంధిలో రాకపోకలు పూర్తిగా పునరుద్ధరణ అయితే, పెద్ద సంఖ్యలో వేచిచూస్తున్న నౌకల వల్ల చమురు సరఫరా మార్కెట్‌లో పుష్కలంగా ఉంటుందని ఆయన వివరించారు. హర్మూజ్ జలసంధిపై ఎలాంటి టోల్ విధించే ప్రణాళికలు లేవని ఒమన్ హామీ ఇచ్చిందని కూడా ఆయన ధ్రువీకరించారు. షిప్పింగ్ కంపెనీలలో విశ్వాసం నింపేందుకు అమెరికా ఇప్పటికే నౌకాదళ ఎస్కార్ట్‌లు, సముద్రయాన పునర్‌బీమా కార్యక్రమం వంటి చర్యలను ప్రకటించింది. నెలల తరబడి నౌకలు నిలిచిపోవడంతో వేలాది మంది నావికులు కుటుంబాలకు దూరంగా, అనిశ్చిత పరిస్థితుల్లో చిక్కుకుపోయారు. మరోవైపు, షిప్పింగ్ కంపెనీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. ప్రస్తుతం కాల్పుల విరమణ, అణు ఒప్పందంపై చర్చలు పురోగమిస్తేనే నౌకల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకుంటాయి. ఒకవేళ అదే జరిగితే చమురు మార్కెట్‌కు అవసరమైన దానికంటే ఎక్కువ సరఫరా అంది, ధరలు వివాదానికి ముందునాటి స్థాయి కంటే కూడా కిందకు పడిపోవచ్చని బెస్సెంట్ అంచనా వేశారు.

## తెలంగాణ ఇందిరమ్మ బీమాపై ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి – జరిగాయి, కానీ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ బీమా పథకం గురించిన మరిన్ని వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. 57: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమాను ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బడ్జెట్ సమావేశంలో భట్టి విక్రమార్క తెలిపినట్లుగా జూన్ 2 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి గరిష్ట వయోపరిమితి 57 సంవత్సరాలుగా నిర్ణయించే అవకాశం ఉంది. 60 ఏళ్లుగా వయోపరిమితిని నిర్ణయిస్తే లబ్ధిదారుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునే సమయంలో నామినీ వివరాలను తప్పనిసరిగా పేర్కొనాలని ప్రభుత్వం తెలిపింది, లేకపోతే దరఖాస్తు తిరస్కరించబడుతుంది. ఒకవేళ కుటుంబంలో ఎవరైనా మరణిస్తే, నామినీకి ఈ బీమా కింద రూ. 5 లక్షలు అందుతాయి.

**ఇందిరమ్మ బీమా పథకానికి అర్హతలు..**

తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ బీమా పథకం జూన్ 2 నుంచి ప్రారంభం కానుంది. ఈ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గరిష్ట వయోపరిమితి 57 ఏళ్లుగా నిర్ణయించనున్నారు. లబ్ధిదారుల సంఖ్య పెరిగితే ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వయోపరిమితిని మూడు సంవత్సరాలు తగ్గించి, 57 ఏళ్ల పరిమితికి కుదించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఇందిరమ్మ బీమా నిబంధనలు..

ఇందిరమ్మ బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఆ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రమే అనుమతిస్తారు. దరఖాస్తు ఫారంలో నామినీ వివరాలు తప్పనిసరిగా ఉండాలి, లేని పక్షంలో అధికారులు అప్లికేషన్‌ను స్వీకరించరు. ఈ నిబంధనను ప్రభుత్వం చాలా ముఖ్యమైనదిగా పేర్కొంది. ఒకవేళ దురదృష్టవశాత్తు లబ్ధిదారుడు మరణిస్తే, నామినీ ఖాతాలో రూ. 5 లక్షల బీమా పరిహారం జమ చేయబడుతుంది. నేరుగా వారి ఖాతాలో ఈ డబ్బును జమ చేస్తారు. లబ్ధిదారుల కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకం ద్వారా సహాయం చేయనుంది.

# పెట్టుబడుల కోసం పోటీకి రెడీ

మొదటిపేజీ తరువాయి – మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన తన రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టుకు లోకేశ్ బదులిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా పెట్టుబడుల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ తప్పదని లోకేశ్ పరోక్షంగా సూచించారు.

**అసలేం జరిగింది?**

తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన, తమ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేశారు. "తమిళనాడు భవిష్యత్తు కోసం ఎదురుచూడటం లేదు, ఆ భవిష్యత్తును మేమే నిర్మిస్తున్నాం. సింగిల్ విండో విధానం, వేగవంతమైన అనుమతులు, ఏఐ నగరాలు, గ్రీన్ హైడ్రోజన్, అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో ఆవిష్కరణలకు చిరునామాగా నిలుస్తున్నాం" అంటూ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఈ వీడియోపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, కీర్తనను అభినందించారు. "కీర్తన గారూ, పెట్టుబడులను ఆకర్షించేందుకు మీరు చూపుతున్న చొరవ అభినందనీయం. ప్రతి మంత్రి తమ రాష్ట్రాన్ని మార్కెటింగ్ చేసుకోవాలి. పెట్టుబడిదారులతో చర్చలు జరిపి, ఉపాధి కల్పించే వారిలో నమ్మకాన్ని నింపాలి. దేశాభివృద్ధిలో రాష్ట్రాలు పోటీపడటాన్ని ప్రధాని మోదీ కూడా ప్రోత్సహిస్తారు" అని పేర్కొన్నారు. అదే సమయంలో "ఆంధ్రప్రదేశ్ నిస్సందేహంగా తమిళనాడుకు గట్టి పోటీ ఇస్తుంది. ఈ సోషల్ మీడియా గోలంతా పట్టించుకోవద్దు. ట్రోల్స్ ఉద్యోగాలు సృష్టించవు, పెట్టుబడులు మాత్రమే ఉద్యోగాలను సృష్టిస్తాయి" అంటూ చురక అంటించారు. లోకేశ్ చేసిన ఈ పోస్టుపై మంత్రి కీర్తన కూడా హుందాగా స్పందించారు. "థ్యాంక్యూ లోకేశ్ గారు. తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా నా నియోజకవర్గ యువతకు అవకాశాలు కల్పించడానికి చిత్తశుద్ధితో, వినయంతో, పట్టుదలతో పనిచేస్తూనే ఉంటాను" అని ఆమె బదులిచ్చారు. మొత్తం మీద ఈ ట్వీట్ల సంభాషణ ద్వారా లోకేశ్.. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, మంత్రి కీర్తనలకు పెట్టుబడుల విషయంలో తాము గట్టి పోటీదారులమని స్పష్టమైన సంకేతాలు పంపారు.

# మహానాడులో టీడీపీకి విరాళాల వెల్లువ

మొదటిపేజీ తరువాయి – విరాళాలు అందినట్లు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విరాళాలు అందించిన ప్రతి ఒక్కరి పేరును వేదికపై నుంచి చదివి, వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మహానాడులో భాగంగా తొలిరోజు రూ.12.44 కోట్లు, రెండో రోజు రూ.13.17 కోట్ల చొప్పున విరాళాలు అందాయని చంద్రబాబు వివరించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలిసి అత్యధికంగా రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు. పార్టీ కోసం వివిధ రూపాల్లో సేవలందిస్తున్నారని, కొందరు సోషల్ మీడియాలో, మరికొందరు క్షేత్రస్థాయిలో పనిచేస్తుంటే, ఇంకొందరు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాం నుంచే మహానాడులో విరాళాలు స్వీకరించే సంప్రదాయం ఉందని, గతంలో హుండీ ఏర్పాటు చేసేవారని సీఎం గుర్తుచేశారు. రెండో రోజు అందిన ప్రధాన విరాళాల్లో ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా తరఫున రాజగోపాల్ రూ.1.50 కోట్లు అందించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు, నారాయణ విద్యాసంస్థలు తలో రూ.కోటి చొప్పున విరాళం ఇచ్చారు. తిరుపతికి చెందిన పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ రూ.50 లక్షలు అందించారు. వీరితో పాటు ఏపీ టెక్నలాజికల్ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ రూ.27 లక్షలు, టీడీపీ నేత శంకర్ రెడ్డి రూ.25 లక్షలు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రూ.19 లక్షలు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రూ.15 లక్షలు ఇచ్చారు. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు రూ.10 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు విరాళాలు ప్రకటించారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గురజాల జగన్మోహన్, కురుగొండ్ల రామకృష్ణ, మామిడి గోవిందరావు, నరేంద్ర వర్మ వంటి వారు రూ.10 లక్షల చొప్పున అందించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పరిటాల సునీత, శ్రీరాం రాజగోపాల్ తదితరులు రూ.5 లక్షలు చొప్పున పార్టీకి తమవంతు సహకారం అందించారు.

# తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం

మొదటిపేజీ తరువాయి – శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్ల జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు.

**చివరి గింజ వరకు కొంటాం**

రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు.

**తడిసిన ధాన్యం కూడా కొనుగోలు**

ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ.13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

**రవాణా కోసం ప్రత్యేక చర్యలు**

ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రపంచం మమ్మల్ని వ్యతిరేకిస్తున్నా, భారత్ అండగా ఉంది

మొదటిపేజీ తరువాయి – తమ దేశం ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ భారత్‌లో మాత్రం తమకు అద్భుతమైన మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. గురువారం వెస్ట్ బ్యాంక్‌లో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**మాకు సమస్యలు లేని ఏకైక దేశం భారత్: నెతన్యాహు**

"భారత్ ఒక అతిపెద్ద శక్తి. ఆ దేశంతో మాకు ఒక ప్రత్యేకమైన సంబంధం ఉంది. ప్రపంచంలోని చాలా దేశాల్లో మా ప్రతిష్ఠకు సవాలు ఎదురవుతోంది. కానీ, ఇండియాలో మాత్రం మాకు ఎలాంటి సమస్యా లేదు. అక్కడ ఇజ్రాయెల్ పట్ల ప్రజల్లో పిచ్చి అభిమానం ఉంది. అది నిజంగా అసాధారణం" అని నెతన్యాహు పేర్కొన్నారు. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంతగా, భారత్ నుంచే తనకు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

**నెతన్యాహుకు అమెరికాలో తగ్గుతున్న ఆదరణ**

అయితే, అంతర్జాతీయంగా ముఖ్యంగా అమెరికాలో నెతన్యాహు ప్రజాదరణ తగ్గుతున్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏప్రిల్‌లో ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన సర్వే ప్రకారం అమెరికాలో 60 శాతం మందికి ఇజ్రాయెల్‌పై ప్రతికూల అభిప్రాయం ఉంది. గత ఏడాది ఇది 53 శాతంగా ఉండేది. అలాగే, 59 శాతం అమెరికన్లు నెతన్యాహు అంతర్జాతీయ వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకుంటారనే నమ్మకం లేదని వెల్లడించారు. గతంలో కూడా నెతన్యాహు అనేక సందర్భాల్లో భారత్‌పై ప్రశంసలు కురిపించారు. 2018లో తన భార్య సారాతో కలిసి భారత్‌లో పర్యటించినప్పుడు తనకు లభించిన ఆదరణను ఆయన 'లవ్ ఫెస్ట్' (ప్రేమ పండుగ)గా అభివర్ణించారు. భారతీయులకు ఇజ్రాయెల్ పట్ల అపారమైన గౌరవం ఉందని ఆయన పలుమార్లు చెప్పారు.

**పాకిస్థాన్‌పై ఆరోపణ**

ఇదే సమయంలో అమెరికాలో తన ఆదరణ తగ్గడానికి పాకిస్థాన్ కారణమని నెతన్యాహు ఆరోపించారు. అమెరికా–ఇజ్రాయెల్ సంబంధాలను దెబ్బతీయాలనుకునే దేశాలు సోషల్ మీడియాలో బాట్ ఫామ్స్ ద్వారా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయని ఆయన అన్నారు. "పాకిస్థాన్‌లోని బేస్‌మెంట్‌లో కూర్చున్న ఎవరో ఒక వ్యక్తి, 'నేను ఇజ్రాయెల్ మద్దతుదారుడిని, కానీ ఇప్పుడు వారిని భరించలేకపోతున్నాను' అని పోస్టులు పెడుతున్నారు" అంటూ ఆయన ఆరోపణలు గుప్పించారు.

# ఆ మూడు డిమాండ్లు ఒప్పుకుంటేనే డీల్

మొదటిపేజీ తరువాయి – పొడిగించి, ఆ ప్రాంతంలో స్థిరత్వం తీసుకువచ్చేందుకు దౌత్యపరమైన చర్చలు తీవ్రమైన నేపథ్యంలో ట్రంప్ ఈ డిమాండ్లను ముందుకు తెచ్చారు.

**అవే మూడు రెడ్ లైన్స్**

అమెరికా నివేదికల ప్రకారం ట్రంప్ విధించిన మూడు షరతులు ఇరాన్ యురేనియం నిల్వలపైనే ప్రధానంగా కేంద్రీకృతమై ఉన్నాయి.

1. ఇరాన్ తన యురేనియం నిల్వలను పూర్తిగా అమెరికాకు బదిలీ చేయాలి.
2. లేదా, అంతర్జాతీయ పర్యవేక్షణకు వీలయ్యేలా ఆ నిల్వలను ఇరాన్ భూభాగంలోనే ధ్వంసం చేయాలి.
3. లేదంటే, ఇరు పక్షాలు అంగీకరించిన మరో ప్రదేశంలోనైనా వాటిని నిర్మూలించాలి.

అణ్వాయుధాల తయారీకి దగ్గరగా ఉన్న యురేనియం నిల్వల విషయంలో వాషింగ్టన్ ఏమాత్రం రాజీపడబోదని ఈ షరతులు తెలియజేస్తున్నాయి. ఇరాన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధ దేశంగా మారకుండా చూడటమే తమ అంతిమ లక్ష్యమని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ట్రంప్ పదేపదే స్పష్టం చేస్తున్నారు.

**నేపథ్యం, తాజా పరిణామాలు**

2026 ప్రథమార్ధంలో ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష సైనిక ఘర్షణల తర్వాత ఈ చర్చలు తిరిగి ఊపందుకున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే లక్ష్యంతో ఈ చర్చలు కొనసాగుతున్నాయి. కీలకమైన హర్మూజ్ జలసంధిని అంతర్జాతీయ నౌకా రవాణాకు తిరిగి తెరవడం, కొన్ని ఆంక్షలను సడలించడం, ఇరాన్ అణు కార్యక్రమాన్ని పరిమితం చేయడం వంటి అంశాలు కూడా చర్చల్లో ఉన్నాయి. మే 29, 2026 నాటికి, కాల్పుల విరమణ పొడిగింపు అంశం పరిశీలనలో ఉంది. రాబోయే వారాల్లో అణు సమస్యలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. యురేనియం స్థాయిలపై కొంత రాజీకి ఇరాన్ సుముఖత చూపుతున్నప్పటికీ, శుద్ధి హక్కులు, ఆంక్షల ఉపసంహరణ వంటి విషయాల్లో ఇరు పక్షాల మధ్య ఇంకా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్నాయి. మరోపక్క, ఒప్పందం కుదుర్చుకోవడంలో తొందరపడొద్దని ట్రంప్ తన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. దౌత్యం విఫలమైతే సైనిక చర్యకు సిద్ధంగా ఉన్నామని కూడా ఆయన హెచ్చరించారు. ఇరాన్ అణు సామర్థ్యానికి వ్యతిరేకంగా బలమైన హామీలు ఉండాలని ఇజ్రాయెల్ వంటి మిత్రదేశాలు కోరుతుండగా, ఒప్పందం విషయంలో మెతక వైఖరి వద్దని కొందరు రిపబ్లికన్ చట్టసభ సభ్యులు ట్రంప్‌పై ఒత్తిడి తెస్తున్నారు.

# డీకే శివకుమార్ వర్సెస్ విజయ్ ఇద్దరూ కోటీశ్వరులే కానీ తేడా ఇదే!



మొదటిపేజీ తరువాయి – కొందరు తమ సంపదను, విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. ఈ కొత్త రాజకీయ ఒరవడికి తమిళనాడు నేత విజయ్, కర్ణాటక నేత డీకే శివకుమార్ ఉదాహరణలుగా నిలుస్తున్నారు. కర్ణాటకకు కాబోయే ముఖ్యమంత్రిగా ప్రచారంలో ఉన్న డీకే శివకుమార్ ఈ కొత్త ట్రెండ్‌కు నిలువుటద్దంలా కనిపిస్తారు. ఆయన తన విలాసవంతమైన జీవనశైలిని ఎప్పుడూ దాచుకోలేదు. ఖరీదైన గూచీ స్కార్ఫ్‌లు, లూయీ విటన్ స్టోల్స్, రోలెక్స్, కార్టియర్ వంటి లగ్జరీ వాచ్‌లను ధరించి బహిరంగంగా కనిపిస్తారు. గతంలో తన వాచ్‌లపై విమర్శలు వచ్చినప్పుడు.. "నాకు నచ్చిన వాచ్ ధరించే హక్కు నాకు లేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. 2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తుల విలువ రూ. 1,413.80 కోట్లు. రియల్ ఎస్టేట్, క్వారీయింగ్, విద్యాసంస్థల ద్వారా ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారు. మరోవైపు తమిళనాడులో తన టీవీకే పార్టీని అతిపెద్ద శక్తిగా నిలిపిన నటుడు–రాజకీయవేత్త విజయ్ తీరు దీనికి భిన్నం. ఆయనది నిశ్శబ్ద సంపద. తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ. 624 కోట్ల నికర ఆస్తులు ప్రకటించిన విజయ్, డబ్బు విషయంలో చాలా సంప్రదాయబద్ధంగా వ్యవహరిస్తారు. ఆయన తన సంపదలో దాదాపు రూ. 313 కోట్లను కేవలం బ్యాంకు డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాల్లోనే ఉంచారు. ఒకే సేవింగ్స్ ఖాతాలో రూ. 213 కోట్లు ఉండటం గమనార్హం. స్టాక్ మార్కెట్‌లో ఆయన పెట్టుబడులు నామమాత్రం. అయితే, రూ. 220 కోట్ల విలువైన స్థిరాస్తులు, రూ. 13.5 కోట్లు విలువైన లగ్జరీ కార్ల కలెక్షన్ ఆయనకు ఉంది. డీకే శివకుమార్ తన సంపదను ఆడంబరంగా ప్రదర్శిస్తే, విజయ్ దానిని నిశ్శబ్దంగా దాచుకున్నారు. కానీ వీరిద్దరూ ఒకే మార్పును సూచిస్తున్నారు. భారత రాజకీయాల్లో కొత్త తరం నేతలు పేదరికాన్ని నటించాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. ఒకప్పుడు రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించే ఖరీదైన వస్తువులు, ఇప్పుడు నేతల బ్రాండ్‌లో ఒక భాగంగా మారుతున్నాయి. ఈ పరిణామం భారత రాజకీయాల్లో వస్తున్న ఓ కీలక మార్పుకు సంకేతంగా నిలుస్తోంది.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తో అనిల్ కుమార్ యాదవ్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, మే 29:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడానికి శ్రీకారం చుట్టారు. రానున్న పట్టణ ప్రాంతాల్లో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ తన అమ్ములపొదిలో ఉన్న ఒక్క అస్త్రాన్ని సిద్ధం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి లో తరతరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ, పార్టీకి అండగా నిలుస్తున్న మరబోయిన అనిల్ కుమార్ యాదవ్ శుక్రవారం లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ అనిల్ కుమార్ యాదవ్ తో స్థానికంగా ఉన్న అనేక విషయాలు తెలుసుకున్నాను. స్వర్గీయ మరబోయిన సత్యనారాయణ యాదవ్ పార్టీకి అందించిన సేవలను రాహుల్ గాంధీ కి వివరించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు 2018 శేరిలింగంపల్లి లో జరిగిన బహిరంగ సభకు సంబంధించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ఢిల్లీ పెద్దలు కూడా సూక్ష్మంగా గమనిస్తున్నారని చెప్పవచ్చు. ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాహుల్ గాంధీ వరుసగా అనిల్ కుమార్ యాదవ్ కు కొంత ప్రాధాన్యత ఇస్తున్నారని సమాచారం. భారత భావి ప్రధాని రాహుల్ గాంధీ ని ప్రత్యేకంగా కలవడం, వారు నేరుగా తనతో పార్టీ క్షేత్రం స్థాయి విషయాలపై చర్చించడం చాలా సంతోషంగా ఉందని, తన పై మరింత భాద్యతను పెంచిందని, భేటీకి సహకరించిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు అంటూ తన అధికారిక సామాజిక మాధ్యమాల్లో రాహుల్ గాంధీ ప్రసాద్ కుమార్ తో కలిసి తీసుకున్న ఫొటోను ప్రచురించారు.

# మూడో రోజూ ప్రశాంతంగా సప్లమెంటరీ, ఓపెన్ స్కూల్ పరీక్షలు



**నిజం న్యూస్ మచిలీపట్నం, మే 29:** మచిలీపట్నంలోని పలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు జిల్లాలో మూడవరోజు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ (గణితం) పరీక్షలు, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు మరియు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత సజావుగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు మచిలీపట్నం పట్టణ పరిధిలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిశీలన జిల్లా విద్యాశాఖాధికారి పట్టణంలోని ప్రధాన కేంద్రాలైన బాలాజీ విద్యాలయం, జైహింద్ హై స్కూల్, నిర్మల హై స్కూల్ మరియు మున్సిపల్ హై స్కూల్ పార్క్ లలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పదో తరగతి సప్లమెంటరీ, ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ తీరును ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. నిబంధనల ప్రకారం నిర్వహణ పరీక్షలు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా నిర్వహించబడుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు పక్కాగా అమలు చేశామని ఆయన పేర్కొన్నారు.

# భరత్ నగర్ లో నూతన పైప్ లైన్లకు శంకుస్థాపన చేసిన కూకట్పల్లి ఎమ్మెల్యే: మాధవరం కృష్ణారావు

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 29:** శుక్రవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరత్ నగర్ హెచ్.ఐ.జి వద్ద 14 లక్షల రూపాయలతో నూతన పైప్లైన్ కొరకు శంకుస్థాపన నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు విషయంలో ఎక్కడా.. ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత నాది అని ...గతంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిదులు కొరత లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతినిత్యం ఏదో ఒకచోట శంకుస్థాపన నిర్వహించేవారుమని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర సంవత్సరాలైనా కూడా నియోజకవర్గానికి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం లేదని.. అరకొర నిధులతో అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తామని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని అఖండ మెజారిటీతో మూడుసార్లు గెలిపించిన ప్రజల రుణం ..ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా సరే ఓర్చుకుని ముందుకు వెళ్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్.. డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, బిక్షపతి.. బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# పంట అవశేషాలను కాల్చవద్దు



**సంగెం మే 29 నిజం న్యూస్:** పంట అవశేషాలను కాల్చడం వల్ల జరిగే నష్టం శాస్త్రీయ విశ్లేషణ మనం పొలంలో మిగిలిన వరి కొయ్యలను లేదా మొక్కజొన్న చొప్పను కాల్చినప్పుడు, పైకి కేవలం పొగ మాత్రమే కనిపిస్తుంది. కానీ భూమి లోపల, పైన జరిగే నష్టం అంతా ఇంతా కాదు పోషకాల నష్టం **(Nutrient Loss)** పంట అవశేషాలను కాల్చడం వల్ల వాటిలో ఉండే నత్రజని **(Nitrogen)** సుమారు 80-90%, భాస్వరం**(Phosphorus)** 25%, పొటాషియం **(Potassium)** 20% వరకు గాలిలో కలిసిపోతాయి. అంటే మనం సొమ్ము పెట్టి కొన్న ఎరువుల విలువను మనమే బూడిద చేసినట్లవుతుంది.మిత్ర పురుగుల నాశనం భూమి పైపొరల్లో ఉంటూ మట్టిని గుల్లబరిచే వానపాములు, పంటకు మేలు చేసే బ్యాక్టీరియా,శిలీంద్రాలు **(Microorganisms)** తీవ్రమైన వేడికి చనిపోతాయి. దీనివల్ల భూమి "జీవం" లేని చౌడు నేలగా మారే ప్రమాదం ఉంది. భూమి భౌతిక స్థితి దెబ్బ తినడం నిప్పు పెట్టడం వల్ల మట్టిలోని తేమ ఆవిరైపోతుంది. మట్టి రేణువుల మధ్య బంధం దెబ్బతిని, నేల గట్టిపడిపోతుంది. ఫలితంగా తర్వాతి పంట వేసినప్పుడు వేర్లు లోపలికి చొచ్చుకుపోవడం కష్టమవుతుంది. గాలి కాలుష్యం **(Air Pollution)** కాలడం వల్ల వెలువడే కార్బన్ మోనాక్సైడ్, మీథేన్, పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం 2.5) వంటి విషవాయువుల వల్ల మన కుటుంబ సభ్యులకు, ఊరి ప్రజలకు శ్వాసకోస సమస్యలు, కంటి జబ్బులు వస్తాయి.అవశేషాలను బంగారంగా మార్చుకునే విధానం (రైతులకు సూచనలు)

పంట వ్యర్థాలను తగులబెట్టకుండా, భూమికి బలమైన సేంద్రీయ ఎరువుగా మార్చడానికిశాస్త్రవేత్తలు సూచిస్తున్న కొన్ని సులభమైన పద్ధతులు

1. భూమిలోనే కలియదున్నడం **(In-situ Incorporation)**

రోటవేటర్ లేదా డిస్క్ హారో వరి కోతల తర్వాత లభ్యమయ్యే కొయ్యలను,మొక్కజొన్న అవశేషాలను రోటవేటర్ **(Rotavator)**సహాయంతో చిన్న చిన్న ముక్కలుగా చేసి భూమిలోనే కలియదున్నాలి.

నీరు పెట్టడం.దున్నిన తర్వాత పొలానికి కొద్దిగా నీరు పెడితే అవి త్వరగా కుళ్ళుతాయి.

2. జీవ రసాయనాల వాడకం **(Microbial Decomposers)**

వేగంగా కుళ్ళింపజేయడం.కలియదున్నిన అవశేషాలు త్వరగా కుళ్ళిపోవడానికి 'పూసా డీకంపోజర్' **(Pusa Decomposer)** బిళ్ళలు లేదా మార్కెట్లో దొరికే వేస్ట్ డీకంపోజర్ (జీవర్ **Decomposer)** ద్రావణాన్ని పొలంలో చల్లాలి.ఇది అవశేషాలను కేవలం 20-25 రోజుల్లోనే అద్భుతమైన సేంద్రీయ ఎరువుగా (ఎబఎబం) మారుస్తుంది.

3. మల్చింగ్ **(Mulching** / పొరగా పరచడం)

తదుపరి పంట (ఉదాహరణకు మునగ, కూరగాయలు లేదా పండ్ల తోటలు) వేసేటప్పుడు ఈ వ్యర్థాలను వరుసల మధ్య పరచడం **(Mulching)** ద్వారా భూమిలో తేమ ఆవిరి కాకుండా కాపాడుకోవచ్చు. ఇది కలుపు మొక్కలను కూడా నివారిస్తుంది.

రైతుకు కలిగే లాభాలు

శాస్త్రీయ సత్యం. ఒక టన్ను వరి గడ్డిని భూమిలో కుళ్ళింపజేయడం వల్ల దాదాపు 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం, అలాగే మన నేలకు ఎంతో అవసరమైన కార్బన్ **(Organic Carbon)** లభిస్తాయి.ఎరువుల ఖర్చు తగ్గుతుంది భూమిలో సేంద్రీయ కర్బనం పెరగడం వల్ల, తర్వాతి పంటకు మనం వేసే రసాయనిక ఎరువుల (యూరియా, డి.ఎ.పి) మోతాదును 20% నుండి 25% వరకు తగ్గించుకోవచ్చు.

దిగుబడి పెరుగుతుంది నేల గుల్లబారి, వేర్లకు గాలి, నీరు బాగా అందుతాయి. దీనివల్ల పంట ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.చట్టపరమైన రక్షణ: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ **(NGT)** నిబంధనల ప్రకారం పంట వ్యర్థాలను కాల్చడం నేరం. ఈ పద్ధతుల ద్వారా మనం చట్టపరమైన ఇబ్బందుల నుండి కూడా దూరంగా ఉండవచ్చు.ముగింపు భూమి మనకు తల్లి లాంటిది. దానికి అగ్నిపరీక్ష పెట్టకుండా, లభించిన వ్యర్థాలను తిరిగి భూమికే అందించి "ఆరోగ్యకరమైన నేల - సుసంపన్నమైన రైతు" గా ఎదుగుదాం. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం.

# సుదనపల్లి గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు

## రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు




**హసన్ పర్తి మే 29 నిజం న్యూస్:** హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం పరిధిలోని సుదనపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు అంగన్‌వాడీ భవనాన్ని శుక్రవారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మరియు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, విద్యా, ఆరోగ్య, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.సుదనపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు వల్ల గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ద్వారా చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన సేవలు అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, ప్రాథమిక విద్యా బోధనకు అనుకూలమైన వాతావరణం కల్పించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ అభివృద్ధి పనులు పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే నాగరాజు కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకారపు లక్ష్మి - లింగస్వామి, ఉప సర్పంచ్ ఆళ్ల దేవేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు, నరేష్ మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఆత్మకూరు ఏఎంసి వైస్ ఛైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, యువకులు, పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కోనరావుపేట మండలం లో వీవోఏలకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంఘీభావం తెలిపారు



**సిరిసిల్ల మే 29 నిజం న్యూస్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వీవోఏలకు వెంటనే అమలు చేయాలని, అలాగే కనీస వేతనం కల్పించి అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. గత పది రోజులుగా మండుటెండలో దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వీవోఏల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, మంతెన సంతోష్, కేందే గంగాధర్, అనుపటి భూంరెడ్డి, అరె మహేందర్, మందల శ్రీను, తిక్కల నవీన్, బుట్టి వంశీ, శివ తేజ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియా ఆస్పత్రిని సందర్శించిన సి ఎం ఓ కిరణ్ రాజ్

## కార్మికులకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.



**క్యాతనపల్లి మే 29 నిజం న్యూస్:** రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ నిన్న ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన క్యాజువాలిటీ, వివిధ వార్డులు,ఓపీ విభాగం మరియు ఇతర ఆసుపత్రి సౌకర్యాలను పరిశీలించి,వాటి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులతో సమావేశమై ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సమస్యలు, అవసరాలు మరియు సేవల మెరుగుదలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. అలాగే ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా, సకాలంలో వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.త్వరలో ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యులను కూడా భర్తీ చేస్తున్నామని హామీ ఇచ్చారు.ఇంకొన్ని నెలల్లో రామగుండంలో క్యాత్ ల్యాబ్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) శ్రీ మధు కుమార్,సీనియర్ పిఓ మదర్ సాహెబ్,మ్యాట్రన్ శ్రీమతి విజయలక్ష్మి మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# కోనరావుపేట ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**సిరిసిల్ల మే 29 నిజం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన మానుక సత్యం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన మానుక సత్యంకు ఎస్సై ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎస్సై ప్రశాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ సమన్వయంతో ముందుకెళ్లాలని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో రైతుల ఆగ్రహం: 20 రోజులుగా లారీలు లేక కల్లాల్లోనే ధాన్యం



**చిలిపిచెడ్, మే 29 నిజం న్యూస్:** మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం రాందాస్‌పల్లి గ్రామంలో లారీల కొరతతో 20 రోజులుగా ధాన్యం రైస్ మిల్లులకు తరలించలేక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన వందలాది ధాన్యం బస్తాలు కల్లాల్లోనే నిలిచిపోయాయి.

**తూకంలో భారీగా నష్టపోతున్నాం**

"వారం రోజులుగా ఎండ, అకాల వర్షాలకు ధాన్యం తేమ శాతం తగ్గిపోయి క్వింటాల్‌కు 3-4 కేజీల వరకు తూకం వస్తోంది. తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు తిరస్కరిస్తున్నారు. లారీలు లేకపోవడం వల్ల కలిగే నష్టాన్ని మేమే భరించాల్సి వస్తోంది" అని రైతులు వాపోయారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: మాజీ సర్పంచ్ యాదగిరి**

ఈ విషయంపై రాందాస్‌పల్లి మాజీ సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ "ధాన్యం సేకరణ, రవాణా పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. లారీలు సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి ధాన్యం తరలించాలి. రైతులకు జరిగిన నష్టానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి" అని డిమాండ్ చేశారు. రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే స్పందించి రవాణా సౌకర్యం కల్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# మహిళా సంఘాలకు 10 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు



**జన్నారం మే 29 నిజం న్యూస్:** జన్నారం వసుంధర మండల సమాఖ్య కార్యాలయంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా మహిళా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మహిళ సంఘాలకు 10 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను ప్యాడి కమిషన్ 8 లక్షలు, ర్యామ్ ల్యాంబ్ 4 లక్షలు, పిఎంఎఫ్ఎంఈ 2 లక్షల చెక్కులను శుక్రవారం జన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, జన్నారం మండల తాసిల్దార్ బక్కయ్య, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, అజ్మీర నందు నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ ఫసిఉల్లా, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముజఫర్ ఆలీ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసాక్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ మంద రాజేష్, దుమల్ల రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీనవేని రాజన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం రాజన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సత్తిష్, నాయకులు శంకర్, ప్రవీణ్, మండల సమాఖ్య అధ్యక్షులు వరలక్ష్మి, నందిని, పుష్పలత, ఎమ్మెస్ సిబ్బంది, ఏపీఎం, సీసీ లు, గ్రామ సంఘ అధ్యక్షులు, తదితరులు పాల్గోన్నారు.

# పైడిపాల లక్ష్మీ 5వ రోజు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు , చైర్మన్ ఇనుగాల, జిల్లా యూత్ అధ్యక్షుడు దిలీప్ రాజ్



**హసన్ పర్తి మే 29 నిజం న్యూస్:** హన్మకొండ జిల్లా మడికొండ ప్రాంతానికి చెందిన మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్ తల్లి పైడిపాల లక్ష్మీ 5వ రోజు కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి మరియు వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
శనివారం 30- 05 - 2026

# బాలయ్య డ్యూయల్ షేడ్స్.. సెకండాఫ్‌లో రాజుగా ఊచకోత!



ఇప్పటికే రిలీజైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా బయటకు వస్తున్న కథా విశేషాలు అంచనాలను మరింత పెంచుతున్నాయి. టాలీవుడ్‌లో మాస్ సినిమాలకు కొత్త నిర్వచనం ఇచ్చిన నటసింహం నందమూరి బాలకృష్ణ, కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు తనదైన ముద్ర వేసుకున్న డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా ఇప్పుడు ఇండస్ట్రీలో భారీ చర్చకు దారి తీస్తోంది. ఇప్పటికే రిలీజైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా బయటకు వస్తున్న కథా విశేషాలు అంచనాలను మరింత పెంచుతున్నా యి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలయ్య పాత్రను రెండు భిన్నమైన షేడ్స్‌లో డిజైన్ చేశారన్న టాక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమాచారం ప్రకారం సినిమాలో ఒకటి ప్రస్తుత కాలానికి చెందిన పవర్‌ఫుల్ పాత్ర కాగా, మరొకటి భారీ ఫ్లాష్ బ్యాక్‌లో కనిపించే రాజసంగా ఉండే యువరాజు లేదా రాజు తరహా పాత్ర అని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌లో వచ్చే ఈ ఫ్లాష్ బ్యాక్ మొత్తం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందట. గోపీచంద్ మలినేని ఈ ఫ్లాష్ బ్యాక్‌ను కేవలం యాక్షన్ కోసమే కాకుండా, బలమైన ఎమోషన్స్ తో నింపుతున్నారని సమాచారం. రాజ్యం, కుటుంబం, త్యాగం, ప్రతీకారం వంటి ఎలిమెంట్స్‌తో ఈ ట్రాక్ సాగుతుందని, ఇందులో బాలయ్య నటన మరోసారి ఫ్యాన్స్ కు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో బాలయ్య లుక్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. ఈ సినిమా సాధారణ కమర్షియల్ యాక్షన్ డ్రామా కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారీ సెట్స్, వార్ ఎపిసోడ్స్, పీరియాడిక్ టచ్‌తో ఈ సినిమాను డైరెక్టర్ గ్రాండ్ విజువల్ స్పెక్టకల్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు టాక్. ముఖ్యంగా సినిమాలో ఈ డ్యూయల్ ఎమోషనల్ ట్రాక్ సినిమాకు ప్రధాన బలమవుతుందని అంటున్నారు. అదే సమయంలో ఎస్. తమన్ మ్యూజిక్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా మారనుంది. ఇప్పటికే రెండు ట్యూన్స్‌ను తమన్ ఫైనల్ చేసినట్లు సమాచారం. గతంలో బాలయ్య సినిమాలకు తమన్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎలా థియేటర్లలో ఊపు తీసుకొచ్చిందో తెలిసిందే. ఈసారి పీరియాడిక్ ఎలిమెంట్స్, యుద్ధ సన్నివేశాలు, ఎమోషనల్ ఫ్లాష్ బ్యాక్ వంటి అంశాల కారణంగా బీజీఎంకి మరింత ప్రాధాన్యం పెరిగింది. ముఖ్యంగా సెకండాఫ్‌లో వచ్చే ఎలివేషన్ సీన్స్‌కు తమన్ సంగీతం ప్రత్యేక బలం కానుందని అభిమానులు ఇప్పటి నుంచే అంచనాలు వేస్తున్నారు. ఇక వీర సింహారెడ్డి తర్వాత బాలయ్య- గోపీచంద్ మలినేని కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సహజంగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరసింహారెడ్డితో బాక్సాఫీస్ వద్ద మాస్ హంగామా సృష్టించిన ఈ కాంబో, ఈసారి మరింత భారీ స్కేల్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అప్పట్లో పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ట్రీట్ ఇచ్చిన గోపీచంద్, ఈసారి అదే మాస్‌కు బలమైన ఎమోషన్‌ను జోడిస్తున్నాడన్న టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రస్తుతం మ్యూజిక్ సిట్టింగ్స్ దశలో ఉన్న ఈ సినిమా నుంచి త్వరలోనే మరిన్ని క్రేజీ అప్‌డేట్స్ వచ్చే అవకాశముంది.



# ఒక్క హీరోతో రెండు పాత్రలు డ్యూయల్ రోల్‌తో దుమ్మురేపిన సినిమాలు

మన అభిమాన హీరోని వెండితెరపై ఒక్క పాత్రలో చూడటానికే థియేటర్లలో ఫ్యాన్స్‌కు రెండు కళ్లు సరిపోవు. అలాంటిది అదే హీరో ఒకే సినిమాలో రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తే ఆ హంగామా మామూలుగా ఉండదు. అందుకే టాలీవుడ్‌లో డ్యూయల్ రోల్ సినిమాలకు ఎప్పుడూ విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అప్పటి సీనియర్ ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలం నుండి ఇప్పటి జనరేషన్ స్టార్ల వరకు డ్యూయల్ రోల్స్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ఆ క్రేజీ సినిమాల ముచ్చట్లు ఇప్పుడు చూద్దాం.. ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల మార్క్ ద్విపాత్రాభినయం: తెలుగు సినిమాలో డ్యూయల్ రోల్‌కు ఒక పక్కా సక్సెస్ ఫార్ములా తెచ్చింది సీనియర్ ఎన్టీఆర్ అనే చెప్పాలి. ఇక ఆయన నటించిన సర్దార్ పాపారాయుడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి వంటి చిత్రాలలో తండ్రీకొడుకులుగా, విభిన్న శైలి పాత్రల్లో ఎన్టీఆర్ నటన అద్భుతంగా ఉండి బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. అలాగే అక్కినేని నాగేశ్వరరావు సైతం తన ఇద్దరుమిత్రులు, బాపు దర్శకత్వంలో వచ్చిన 'బుద్ధిమంతుడు' చిత్రాలలో ద్విపాత్రాభినయం చేసి ప్రేక్షకులను మెప్పించారు. సూపర్ స్టార్ కృష్ణ ప్రయోగాలు.. బాల నటుడిగా మహేష్: నటశేఖర కృష్ణ కూడా తన కెరీర్‌లో ఎన్నో ప్రయోగాలు చేశారు. ఆయన ద్విపాత్రాభినయం చేసిన కౌబాయ్ తరహా చిత్రం మహా మోసగాడు ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. విశేషం ఏంటంటే, ఆయన కుమారుడు సూపర్ స్టార్ మహేష్ బాబు బాల నటుడిగా ఉన్నప్పుడే తండ్రి కృష్ణ దర్శకత్వంలో కొడుకు దిద్దిన కాపురం, అన్నాతమ్ముడు సినిమాల్లో డ్యూయల్ రోల్స్ పోషించి చిన్నప్పుడే సూపర్ హిట్లు అందుకోవడం విశేషం.బాక్సాఫీస్ దదదదలాడించిన బాలయ్య, ఎన్టీఆర్: ఇక ఇప్పటి తరం స్టార్లలో నందమూరి బాలకృష్ణ 'అఖండ' సినిమాలో ఒకవైపు రైతుగా, మరోవైపు అఘోరా (అఖండ)గా రెండు విభిన్న పాత్రల్లో ఊరమాస్ నటనతో ఇండస్ట్రీ హిట్ కొట్టారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ సైతం 'దేవర' చిత్రంలో తండ్రి (దేవర), కొడుకు (వర)గా నటించి వందల కోట్ల వసూళ్లు సాధించారు. ఇక అంతకుముందు తారక్ 'జై లవ కుశ'లో ఏకంగా మూడు విభిన్న పాత్రలు (త్రిపాత్రాభినయం) పోషించి నటుడిగా తన విశ్వరూపం చూపించారు. రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' మ్యాజిక్: మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ కూడా గ్లోబల్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'గేమ్ చేంజర్' సినిమాలో డ్యూయల్ రోల్ చేసి అదరగొట్టారు.ఇక రెండు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రల్లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెట్టిన ఎఫర్ట్స్ మరియు ఆయన నటనకు ప్రేక్షకుల నుండి, అటు అభిమానుల నుండి సూపర్ మార్కులు పడ్డాయి. ఒకే సినిమాలో ఒకే హీరో రెండు విభిన్న రూపాల్లో కనిపిస్తే వచ్చే కిక్కే వేరు. నటుడిగా హీరోలకు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి, అటు ప్రేక్షకులకు డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ పంచడానికి ఈ డ్యూయల్ రోల్ స్టోరీలు ఎప్పుడూ బెస్ట్ ఛాయిస్. ఇక మరి మున్ముందు మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఇలాంటి ద్విపాత్రాభినయాలతో ఇంకెన్ని వండర్స్ క్రియేట్ చేస్తారో చూడాలి.

# రామ్ చరణ్‌పై 'దురంధర్' ఒత్తిడి




టాలీవుడ్ పాన్ ఇండియా స్టార్లకు అకస్మాత్తుగా సరికొత్త చిక్కులు, సవాళ్లు ఎదురవుతున్నాయి. బాక్సాఫీస్ వద్ద దురంధర్, దురంధర్ 2 చిత్రాలు సృష్టించిన అసాధారణ ప్రభంజనం.. సాధించిన రికార్డు బ్రేకింగ్ వసూళ్లు భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేశాయి. కేవలం కలెక్షన్ల పరంగానే కాకుండా.. ఆ సినిమాల స్క్రీన్ ప్లే ఫార్మాట్, మేకింగ్ స్టాండర్డ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో ప్రస్తుతం టాలీవుడ్ రేస్‌లో ఉన్న టాప్ స్టార్స్ అందరూ తమ తదుపరి చిత్రాలతో అవే ప్రమాణాలను అందుకోవాలని.. రికార్డులను అధిగమించాలని తపిస్తుండటంతో అది కాస్తా తీవ్ర ఒత్తిడిని పెంచడం ఖాయమని అంచనా వేస్తున్నారు. ఈ గట్టి పోటీలో అందరికంటే ముందుగా మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం -పెద్ది-పై అటు పరిశ్రమలోనూ, ఇటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాతో ఉత్తరాదిన బాక్సాఫీస్ వద్ద సరికొత్త వేవ్స్ క్రియేట్ చేయాలని చరణ్ గట్టిగా ప్లాన్ చేస్తున్నారు. దర్శకులు బుచ్చిబాబు సానా, సుకుమార్ అందించిన అద్భుతమైన కంటెంట్‌ను ఆయన బలంగా నమ్మారు. ఈ నమ్మకంతోనే నార్త్ ఇండియా మార్కెట్‌ను కొల్లగొట్టేందుకు చరణ్ రంగంలోకి దిగారు. హిందీ బెల్ట్‌లో ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా -పెద్ది- చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ట్రెండ్ సెట్ చేయడం కోసం గతానికి భిన్నంగా విభిన్నమైన ఉత్తరాది నగరాలను ఎంచుకుని ప్రమోషన్స్ చేస్తుండటం విశేషం. అయితే -దురంధర్- సృష్టించిన రికార్డులను దాటడం అంత తేలికైన విషయం కాదు. ఆ సవాల్‌ను స్వీకరిస్తూ చరణ్ చేస్తున్న ఈ వినూత్న ప్రచార వ్యూహాలు ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. కేవలం రామ్ చరణ్ మాత్రమే కాదు.. ఆ తర్వాత బాక్సాఫీస్ పోరులోకి రాబోయే ఇతర బాలీవుడ్ స్టార్ల సినిమాలతో పాటు, ఎన్టీఆర్, ప్రభాస్, మహేష్ బాబు, అల్లు అర్జున్ వంటి నలుగురు బిగ్ స్టార్లపై కూడా ఇదే తరహా ఒత్తిడి ఉండబోతోంది. ప్రస్తుత డిజిటల్ - ఓటీటీ యుగంలో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలంటే కేవలం కంటెంట్ బాగుంటే సరిపోదు. ఉత్తరాది, దక్షిణాదితో పాటు ఓవర్సీస్‌లోనూ జనాల్లో పూనకాలు పెంచేలా భారీ ఎత్తున ఎంతో తెలివిగా ప్రచార ప్రణాళికలను రచించాల్సి ఉంటుంది. అప్పుడే ఆయా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్రను లిఖించగలవు. ప్రస్తుతం రామ్ చరణ్ -పెద్ది- సినిమా కోసం చేస్తున్న పబ్లిసిటీ స్టంట్ గనుక ఫలిస్తే అది మునుముందు విడుదల కానున్న సినిమాలకు ఒక రోడ్ మ్యాప్‌లా మారుతుంది. భవిష్యత్తులో కేవలం టాలీవుడ్ పాన్ ఇండియా స్టార్లే కాకుండా, మిగిలిన దక్షిణాది హీరోలందరూ కూడా ఇదే బాటలో ప్రయాణించే ఆస్కారం ఉంటుంది. మరి -దురంధర్- తన ముందుంచిన సవాల్ ని మన పాన్ ఇండియా స్టార్లు ఏవిధంగా ఫేజ్ చేస్తారో వేచి చూడాలి.




# హీరోయిన్లే గేమ్ ఛేంజర్లా?

రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ టాక్సిక్ ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. గీతా మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ యాక్షన్ డ్రామా ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్నట్లు సమాచారం. కేజీఎఫ్ 2 తర్వాత యష్ నటిస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆ మూవీపై అందరికీ ఆసక్తి నెలకొంది. అయితే తాజాగా యష్ చేసిన కామెంట్స్ సినిమాపై ఉన్న హైప్ ను మరింత పెంచేశాయి. సాధారణంగా కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు పాటలు, గ్లామర్ లేదా హీరో చుట్టూ తిరిగే సన్నివేశాలకు పరిమితం అవుతుంటాయి. కానీ టాక్సిక్ లో మాత్రం ఆ ఫార్ములాను పూర్తిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు యష్ వెల్లడించారు. ముఖ్యంగా సినిమాలో నటిస్తున్న స్టార్ హీరోయిన్లు నయనతార, కియారా అద్వానీ రోల్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాయని తెలిపారు. సినిమాలో వారు కేవలం గ్లామర్ డాల్స్ గా కనిపించరని, స్ట్రాంగ్ పర్సనాలిటీ కలిగిన బ్యాడ్ యాస్ ఉమెన్ పాత్రల్లో కనిపించనున్నారని యష్ హింట్ ఇచ్చారు. అంతేకాదు, వారి పాత్రల్లో నెగెటివ్ షేడ్స్ కూడా ఉంటాయని చెప్పడంతో సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని విధంగా నయనతార, కియారా కనిపించబోతున్నారని టాక్ వినిపిస్తోంది. ఉమెన్ రోల్స్ ఇంపార్టెన్స్ గురించి మాట్లాడిన యష్, "మా కథలో ప్రతి ఫిమేల్ రోల్ తన జీవితానికి తానే బాధ్యత వహించే వ్యక్తిగా కనిపిస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ధైర్యంగా నిలబడే స్ట్రాంగ్ పాత్రలు ఇందులో ఉన్నాయి. ప్రతి మనిషి జీవితంలో రాజకీయాలు, హింస, ఎమోషన్స్ ఉంటాయి. వాటిని మహిళా యాంగిల్ నుంచి చూపించినప్పుడు కథ మరింత ఆసక్తికరంగా మారుతుంది" అని తెలిపారు. యష్ చేసిన వ్యాఖ్యలతో టాక్సిక్ కేవలం యాక్షన్ మూవీ మాత్రమే కాదని, భావోద్వేగాలు, పవర్‌ఫుల్ క్యారెక్టర్లు కలిసిన ఇంటెన్స్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. ముఖ్యంగా ఫిమేల్ లీడ్ రోల్స్ చుట్టూ కథలో కీలక మలుపులు తిరిగే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణీ వసంత్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని అర్థమవుతోంది. ఇక టాక్సిక్ సినిమాను భారీ బడ్జెట్ తో కేవీఎన్ ప్రొడక్షన్స్ తెరకెక్కిసస్తుండగా.. విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, స్టైలిష్ ప్రెజెంటేషన్ విషయంలో ఎలాంటి రాజీ పడటం లేదని సమాచారం. యష్ కూడా ఆ సినిమా కోసం ప్రత్యేక లుక్ తో పాటు తన రోల్ పై భారీగా వర్క్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ చేశాయి. మరోవైపు, సినిమాను ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మూవీ టీమ్ ప్లాన్ చేస్తోంది. విడుదలకు ముందు భారీ ప్రమోషన్లు కూడా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. యష్ ఇచ్చిన తాజా హింట్ తో ఇప్పుడు అభిమానుల్లో ఒకే చర్చ నడుస్తోంది.. టాక్సిక్ లో హీరో మాత్రమే కాదు.. హీరోయిన్లే అసలు గేమ్ ఛేంజర్స్ అవుతారా అని! మరేం జరుగుతుందో అంతా వేచి చూడాలి.



# కామాఖ్యా దేవి ఆలయంలో సూర్య-జ్యోతిక ప్రత్యేక పూజలు.. వైరల్ అవుతున్న స్టార్ కపుల్ ఫోటోలు



కోలీవుడ్‌లో అత్యంత అభిమానాన్ని సంపాదించిన జంటల్లో సూర్య--జ్యోతిక జంటకు ప్రత్యేక స్థానం ఉంది. తెరపై తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ జంట, నిజ జీవితంలోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యక్తిగత జీవితాన్ని, కెరీర్‌ను సమతూకంగా కొనసాగిస్తూ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.ప్రస్తుతం ఈ స్టార్ కపుల్ కెరీర్ పరంగా కూడా మంచి జోష్‌లో ఉన్నారు. ఇటీవల సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోగా, జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన 'సిస్టం' సినిమా కూడా మంచి స్పందనను అందుకుంది. వరుస విజయాలతో ఫుల్ హ్యాపీగా ఉన్న ఈ జంట తాజాగా ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లారు. దీనిలో భాగంగా సూర్య, జ్యోతిక కలిసి అస్సాంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్యా దేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అక్కడ కొన్ని ప్రత్యేక ఫోటోలకు పోజులిచ్చారు. సాంప్రదాయ దుస్తుల్లో సూర్య, జ్యోతిక ఎంతో సింపుల్‌గా, ప్రశాంతంగా కనిపించారు. వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు కూడా ఈ ఫోటోలను పెద్ద ఎత్తున షేర్ చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఎవర్‌గ్రీన్ జంట", "సక్సెస్ తర్వాత దైవ దర్శనం చాలా మంచి విషయం", "ఇద్దరూ చాలా అందంగా ఉన్నారు", "ఇదే నిజమైన పవర్ కపుల్" అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, సూర్య ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, జ్యోతిక కూడా పలు కీలక కథలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఒకవైపు సినీ ప్రయాణం, మరోవైపు కుటుంబ జీవితం రెండింటినీ సమతూకంగా కొనసాగిస్తున్న ఈ స్టార్ జంట మరోసారి వార్తల్లో నిలిచింది.